
ప్రజాశక్తి
ఆదివారం 9 మార్చి 2025
5
పార్వతీపురం మన్యం



యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లా, మండల స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ఇకపై ప్రతి సోమవారం పిజిఆర్ఎస్ నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా ప్రధాన కేంద్రం, మండలాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులను అందించి, పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోరారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట

ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి



మహిళా దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని, బడ్జెట్‌లో రూ.4,332 కోట్లు కేటాయించడం ఇందుకు నిదర్శనమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో శనివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పండగ వాతావరణంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఉన్నతమైన స్థానాల్లో నిలిచారని గుర్తుచేశారు. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా, ఆర్థికవేత్తలుగా, విద్యావేత్తలుగా ఎదుగుతున్నారని, ఇది శుభదాయకమని తెలిపారు. ప్రతి మహిళా లక్షాధికారి కావాలని ఆమె ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణించిన, సేవలందించిన మహిళలకు జ్ఞాపిక, శాలువ, ధృవీకరణ పత్రాలతో సత్కరించారు. వాలీబాల్, రన్నింగ్, కబడ్డీ, ఖోఖో విజేతలకు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన కళాకారులకు, ప్రేరణ సఖిలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం మెగా చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ రూ.548 కోట్లు డ్వాక్రా మహిళలకు మెప్మా, స్త్రీనిధి ద్వారా బ్యాంకు లింకేజీని అందిస్తున్నామని అన్నారు. జిల్లాలో విడివికెల ద్వారా డ్వాక్రా మహిళలను ప్రోత్సహిస్తూ, వారికి అండగా నిలుస్తున్నామని, వారి ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లాలో మూఢనమ్మకాలు ఉన్నాయని, బాల్య వివాహ రహిత జిల్లా కోసం అనీమియా కమిటీలు, డ్వాక్రా గ్రూపులు, స్వచ్ఛంద సంస్థలు, అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. 18 ఏళ్ల నిండని అమ్మాయిలకు వివాహాలు జరిపించబోమని వారి తల్లితండ్రుల నుంచి డిక్లరేషన్ తీసుకుంటున్నామని తెలిపారు. ఒఎన్‌డిసి ప్లాట్‌ఫాం ద్వారా మహిళలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ వంట గదికి పరిమితమైన మహిళలను చట్టసభలో శాసనసభాపతి, మంత్రిని చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదని అన్నారు. ప్రతి కుటుంబంలో మహిళ పాత్ర అనితర సాధ్యమని, అటువంటి మహిళలను గౌరవించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు విడివికెలను ఏర్పాటు చేసి, అవసరమైన శిక్షణ, యంత్రాలు, మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. ఐటిడిఎ పరిధిలో 300 సంఘాల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అనంతరం డిఆర్ఒ కె.హేమలత, జిల్లా ఐసిడిఎస్ అధికారి టి.కనకదుర్గ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు పథక సంచాలకులు సుధారాణి, వై.సత్యంనాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుపతినాయుడు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి.కరుణాకర్, బిసి సంక్షేమ శాఖ అధికారి ఎస్.కృష్ణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.భాస్కరరావు, జిల్లా ప్రోగ్రామ్ అధికారి టి.జగన్మోహనరావు, జట్టు ఆశ్రమ నిర్వాహకులు వెలిగొండ పద్మజ, చేనేత జౌళి శాఖ సహాయ అభివృద్ధి అధికారి ఎన్.వెంకటరమణ, సిడిపిఒలు, సూపర్ వైజర్లు, అంగన్వాడీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

స్టాళ్ల సందర్శన

మహిళా దినోత్సవ వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటుచేసిన ప్రదర్శన స్టాళ్లను ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరితో కలిసి కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తిలకించారు. టిటిడి కళ్యాణ మండపం ప్రాంగణంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ – వెలుగు, మెప్మా, గిరిజన సహకార సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, ఐసిడిఎస్, బిసి కార్పొరేషన్, చేనేత పరిశ్రమ, సేంద్రియ వ్యవసాయం తదితర శాఖలు స్టాళ్లను ఏర్పాటు చేశాయి. ప్రతి స్టాల్‌ను విప్, కలెక్టర్ సందర్శించి వివరాలను ఆయా అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖ తరపున విద్యార్థులకు ఈ సందర్భంగా విప్, కలెక్టర్ కళ్ళజోళ్లను పంపిణీ చేశారు.



స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

మహిళా దినోత్సవ వేడుకల్లో వివిధ రకాల లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మెగా చెక్కులను పంపిణీ చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు ద్వారా 50,167 మందికి బ్యాంకు లింకేజి, ఎస్‌హెచ్‌జి, ఎస్ఎంఇ, పిఎంఎజెవై పథకాల ద్వారా జీవనోపాధుల నిమిత్తం రూ.55.85 కోట్ల మెగా చెక్కును అందజేశారు. మెప్మా ద్వారా పార్వతీపురం మునిపాలిటీ పరిధిలోని 1,580 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజి కింద

చెక్కులు పంపిణీ

రూ.10.91 కోట్లు, బిసి కార్పొరేషన్ ద్వారా బిసి, కాపు, ఇబిసి మహిళలకు టైలరింగ్ శిక్షణ నిమిత్తం బేసిక్ టైలరింగ్ ట్రైనింగ్ పథకం కింద 1,514 మంది మహిళలకు రూ.3.78 కోట్లు, జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా పిఎం విశ్వకర్మ కింద రూ.2 లక్షలు, పిఎంఇజిపి కింద ఇద్దరికి రూ.17 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా ఒక్కొక్కటి రూ. 30 వేల విలువైన రెండు ల్యాప్‌టాప్ లను ఇద్దరు వికలాంగులకు అందజేశారు.



జియ్యమ్మవలసలో నిరసన తెలుపుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, దళితులు

దళితులకు ఉపాధి కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

ప్రజాశక్తి - కురుపాం

దళితులకు ఉపాధి హామీ పనులు వెంటనే కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగనాయుడు డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రను శనివారం ప్రారంభించారు. అందులో భాగంగా జియ్యమ్మవలస మండలంలో కేంద్రంలోని దళితవాడను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ దళితులు రెండు వారాలుగా ఉపాధి పనులు ఇవ్వడం లేదని, కాలనీకి మంచినీటి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో దళితులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు వారాల నుంచి దళితులకు ఉపాధి పనులు కల్పించకపోవడం సరికాదన్నారు. రైతుల భూముల్లో ఫారం పాండ్ పనులు చెయ్యమంటున్నారని, దానికి రైతులు అంగీకరించడం లేదని చెప్పారు. ఆ విషయం అధికారులకు చెబితే రైతులను ఒప్పించే బాధ్యత మీదేనని అంటున్నారని దళితులు వాపోయారని తెలిపారు. ప్రజలు ఏపని కోరితే ఆ పని కల్పించాలని చట్టంలో ఉన్నప్పటికీ కూలీలకు లక్ష్యాలు పెట్టి పని ఇవ్వకుండా ఎగ్గొట్టడం సరైంది కాదన్నారు. వ్యవసాయంలో యంత్రాలు పెరిగి కూలీలకు పనిదినాలు తగ్గిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఉపాధి పనులు కల్పించకపోతే వలసలు పోయే ప్రమాదం ఉందని చెప్పారు. మన్యం జిల్లాలో ఉపాధి హామి అధికారులకు రోడ్లు, ప్రహరీలు కట్టించడానికి ఉన్న శ్రద్ధ ఉపాధి కూలీలకు పనులు కల్పించడం లో లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే జిల్లా వ్యాప్తంగా ఉపాధి పని కోరిన ప్రతిఒక్కరికీ కల్పించాలని డిమాండ్ చేశారు. దళిత కాలనీకి తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. దళితుల శ్మశానానికి రెండు ఎకరాల భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె.సీతారాం, సిపిఎం నాయకులు బి.మోహన్‌రావు, దళితులు పాల్గొన్నారు.

పరిమితికి మించితే చర్యలు

ప్రజాశక్తి-సాలూరు

పరిమితికి మించి ప్రయాణికులతో ఆటోలను నడపరాదని, లేకుంటే చర్యలు తప్పవని సాలూరు టౌన్ సిఐ బి.అప్పలనాయుడు హెచ్చరించారు. సాలూరు జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్, కార్లలో సీటుబెల్ట్ ధరించాలని కోరారు. వాహనాలకు సంబంధించిన అన్ని రకాల పత్రాలు కలిగి ఉండాలని సూచించారు.

మహిళల సమస్యలపై

ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలు

ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి-పాలకొండ

మహిళా సమస్యలపై ప్రత్యేకంగా శాసనసభ సమావేశాలు నిర్వహించాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.హిమప్రభ ప్రభుత్వాన్ని కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐద్వా ఆధ్వర్యంలో శనివారం పాలకొండ ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి కోట దుర్గ ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రామిక మహిళలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు సమాజంలో పురుష ఆధిక్యతను పెంచి పోషించే మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా శ్రామిక మహిళలు పోరాడాలన్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి బి.అమరవేణి మాట్లాడుతూ పార్ట్ టైం, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పేరుతో మహిళలను శ్రమదోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావల రమణారావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మహేష్, సిఐటియు సీనియర్ నాయకులు ఎం.తిరుపతిరావు, ఐద్వా నాయకులు బి.పార్వతి, దుర్గమ్మ, పద్మావతి, శారద, జెస్సి బాయ్, ఎం.కాంతారావు, కె.రాము తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా, సిఐటియు నాయకులు, మహిళలు

12న యువత పోరు

విజయవంతం చేయాలని వైసిపి పిలుపు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఈ నెల 12న పార్వతీపురంలో నిర్వహించే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు పిలుపునిచ్చారు. శనివారం పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించిందని విమర్శించారు. సుమారు 10 నెలలు పూర్తి కావస్తున్నప్పటికీ ఇచ్చిన మాటను నిలబెట్టుకునే పరిస్థితి లేదని చెప్పారు. ఉద్యోగాల కల్పన లేకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెనల బకాయిలు చెల్లించకుండా, వైద్య విద్యను ప్రైవేటీకరిస్తూ విద్యార్థులను టిడిపి కూటమి ప్రభుత్వం నిలువునా మోసగించిందన్నారు. దీంతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి బకాయిలు చెల్లించేలా అన్ని జిల్లా కేంద్రాల్లో ఈనెల 12న యువత పోరు కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. పార్వతీపురంలో జరిగే యువత పోరు కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.

అనంతరం మాజీ ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ 12న ఉదయం 10 గంటలకు వైఎస్ఆర్ విగ్రహం వద్ద ప్రారంభమై భారీ ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం సమర్పిస్తామన్నారు. సమావేశంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, మూడు మండలాలు, పట్టణ అధ్యక్షులు బొమ్మి రమేష్, బొంగు చిట్టి రాజు, పాలవలస మురళీకృష్ణ, కొండపల్లి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

రాజీయే రాజమార్గం

రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు

ప్రజాశక్తి-పార్వతీపురం

రాజీమార్గమే రాజమార్గమనే సూత్రాన్ని అనుసరించి, వివాదాలను చక్కదిద్దుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ అద్భుతమైన అవకాశం కల్పిస్తోందని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు సముదాయంలో ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వివాదాలు ఒకసారి ప్రారంభమైతే, జీవితాంతం కొనసాగుతూనే ఉంటాయని, వాటిని త్వరగా పరిష్కరించుకోవాలని కక్షిదారులకు విజ్ఞప్తి చేశారు. లోక్ అదాలత్ ద్వారా సంవత్సరాల తరబడి సాగే న్యాయపరమైన ఇబ్బందుల నుండి కేసులను తక్షణమే పరిష్కరించుకోవచ్చని సూచించారు. సులభమైన, తక్కువ ఖర్చు, ప్రతిరోజూ కోర్టుకు తిరగాల్సిన అవసరం లేకుండా సమస్యను ఒకేరోజు పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడానికి ఫిర్యాదుదారుడు, నిందితుడు ఇద్దరూ కోర్టుకు హాజరు కావాలని సూచించారు.

జాతీయ లోక్ అదాలత్‌లో మోటారు వెహికల్ ఆక్సిడెంట్ కేసులు : 6, దావాలు :22, ప్రొనోట్ దావాలు :7, టైటిల్ దావాలు : 5, ఫైనల్ డిక్రీ పిటిషన్– 1, ఎక్సైజ్ కేసులు: 45, చెక్ బౌన్స్ కేసులు : 5, కుటుంబ తగాదా కేసులు :4, ఎస్.టి.సి కేసులు :272, ప్రీ లిటిగేషన్ కేసులు: 4, క్రిమినల్ కాంపౌండ్ బుల్ కేసులు– 53లను పరస్పర అంగీకారంతో రాజీ చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సౌమ్య జోస్ఫిన్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రకుమార్ పాల్గొన్నారు.

కురుపాం : లోక్ అదాలత్‌లో 56 కేసులు రాజీ అయ్యాయి. పార్వతీపురం జిల్లా కోర్టులో కురుపాం మండల న్యాయ సేవకి సంబంధించి కురుపాం జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జోసెఫ్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కురుపాంకు సంబంధించి ఐపిసి – 3, ఎక్సైజ్ కేసులు – 25, ఎస్‌టిఎస్ కేసులు–25, క్రిమినల్ కేసులు – 3 మొత్తం 56 కేసులు రాజీచేసినట్లు లోక్ అదాలత్ సభ్యులు బరాటం చంద్రమౌళి, సిహెచ్ రాంప్రసాద్ తెలిపారు.



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు

సహజ రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న సన్యాసిరావు, శంకర్రావు

ప్రజాశక్తి-సీతంపేట

ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మన్యం సహజ రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి ఇఎస్ఎఫ్ మహిళా దినోత్సవం సందర్భంగా అవార్డును అందజేసింది. కేరళలోని త్రిశూర్‌లో భారత్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఫర్ కలెకివ్ ఎంటర్ప్రైజెస్ అవార్డును ఆర్‌బిఐ ప్రతినిధులు సతీష్, కె.మల్హోత్రా, ఇఎస్ఎఫ్ ఫౌండర్ పాల్ జోసెఫ్ చేతుల మీదుగా ప్రథమ బహుమతి, రూ.లక్ష నగదును ఆర్ట్స్ డైరెక్టర్ సన్యాసిరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మన్యం సహజ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సిఇఒ బి.శంకర రావు పాల్గొన్నారు.

10న ప్రభుత్వ పింఛనుదారుల సమావేశం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం సబ్ ట్రెజరీ పరిధిలో ప్రభుత్వ పింఛనుదారుల సమావేశాన్ని ఈ నెల పదో తేదిన నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం కార్యదర్శి డి.గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో బెలగాం రైతు బజార్ దగ్గర ఉన్న పింఛనుదారుల సమావేశ మందిరంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.


నేడు సిర్లి పోతన్న యాత్ర

కురుపాం : కురుపాంలో సిర్లి పోతన్న యాత్ర ఆదివారం జరగనుంది. ప్రతి ఏటా స్థానిక ఎంపిడిఒ కార్యాలయ వెనుక భాగంలో సిర్లిపోతన్న గుడిలో ఉన్న పుట్టకు కురుపాంతోపాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇందులో భాగంగా శనివారం కురుపాంలో మేళతాళాలతో ఊరేగింపుగా పాల జంగిడితో జోగి దండే కార్యక్రమం చేట్టారు.

జిల్లాకు 35 మంది ట్రెయినీ ఎస్ఐలు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ప్రాక్టికల్ శిక్షణ నిమిత్తం జిల్లాకు 35 మంది నూతన ప్రొబేషనరీ ఎస్ఐలను ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు వారు శనివారం ఎస్‌పి ఎస్.వి.మాధవ్ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమశిక్షణ, నిజాయతీ, పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించాలని చెప్పారు. పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా విధులను నిర్వర్తించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రాక్టికల్ శిక్షణలో టెక్నాలజీని ఉపయోగించి ఉత్తమ ఫలితాలను రాబట్టి ప్రజలకు మరింత సేవ చేసేలాగా చూడాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని చెప్పారు. ఎఫ్ఐఆర్, దర్యాప్తుకు సంబందించిన రికార్డులను రాయడం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. కేసులను ఏవిధంగా ఛేదించాలి, సిసిటిఎన్ఎస్, డ్రోన్స్‌ను ఉపయోగించడం, పెట్రోలింగ్, సిసి కెమెరాలను ఉపయోగించు విధానం, పహరా బీట్, ఎన్‌డిపిఎస్ కేసులలో చేపట్టే విధులు, కేసు డైరీ రాయడం, నేర స్థలాన్ని ఏవిధంగా పరిశోధించాలి, బందోబస్త్, , పోలీస్ స్టేషన్ నిర్వహణ, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్లో నిర్వహిస్తున్న వివిధ క్రైమ్ రికార్డులను ఏ విధంగా నిర్వహించాలి మొదలగు అంశాల గురించి క్షుణ్ణంగా నేర్చుకోవాలన్నారు. ఎక్కడా ఏవిధమైన అనుమానం వచ్చిన వెంటనే సీనియర్ అధికారులను అడిగి తెలుసుకుని నివృత్తి చేసుకోవాలని తెలియజేశారు.



ట్రెయినీ ఎస్ఐలతో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

నీలకంఠాపురంలో పీసా కమిటీ సమావేశం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో నీలకంఠాపురం పంచాయతీలో శనివారం సర్పంచ్ ఎ.మన్మథరావు ఆధ్వర్యంలో పీసా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పంచాయతీలోని పీసా ఉపాధ్యక్షులు, కమిటీ మెంబర్లు హాజరయ్యారు. పంచాయతీలో ప్రధానమైన సమస్యలపై సమీక్షించారు. వేసవి నేపథ్యంలో ప్రతి గ్రామానికీ తాగునీరు అందించేలా చర్యలు తీసుకుని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని సర్పంచ్‌ని కోరారు. వివిధ గ్రామాలకు మంజూరైన పాఠశాల రక్షణగోడల పనులను గ్రామస్తులకు, పీసా కమిటీకి తెలియకుండా బయటి నుండి వచ్చి పనులు చేయడం సమంజసం కాదని తెలిపారు. అధికారులు స్పందించి పనులను గ్రామస్తులకు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఇంటికుప్పల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అనుబంధ విభాగాల్లో
జిల్లా నాయకులకు చోటు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

వైసిపి అనుబంధ విభాగాల్లో జిల్లాకు చెందిన ఐదుగురు నాయకులకు చోటు లభించింది. ఈ మేరకు శనివారం వైసిపి కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా గుల్లిపల్లి సునీత, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా ఎం.విశ్వనాథం, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శులుగా గెంబలి రమేష్, సత్యవరపు వాసుదేవరావు, మేధావుల వేదిక సంయుక్త కార్యదర్శిగా సిద్ధ జగన్నాథం నియమితులయ్యారు. వీరికి మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు శుభాకాంక్షలు తెలిపారు.

సిసి రోడ్డు వేయాలని వినతి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని గుమ్మలక్ష్మీపురం క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి స్వీకరించారు. డుమ్మంగి పంచాయతీ కొరడగూడ గిరిజనులు తమ గ్రామంలో సిసి రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి అందించారు. గ్రామంలో సిసి రోడ్డు లేక వర్షాకాలంలో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలు తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

చింతపండు సేకరణ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లోవ ముఠా ప్రాంతమైన కుంతేసు గ్రామంలో శనివారం జిసిసి అధికారులు గిరిజనుల వద్ద నుంచి చింతపండు కొనుగోలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర ప్రకారం కిలో రూ.36కు గిరిజనుల వద్ద నుంచి 40 క్వింటాళ్లు చింతపండు కొనుగోలు చేసినట్లు బ్రాంచ్ మేనేజర్ కృష్ణప్రసాద్ తెలిపారు. దళారుల బెడద లేకుండా జిసిసి అధికారులు నేరుగా గిరిజనుల వద్దకు వెళ్లి చింతపండు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనుల వద్ద నుంచి అన్ని రకాల అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో గోదాం సూపరింటెండెంట్ సాంబశివరావు, సేల్స్‌మేన్లు రామన్నదొర, సన్యాసినాయుడు తమ్మయ్య పాల్గొన్నారు.

ఖర్చు లేకుండా ఎరువు తయారీ

ప్రజాశక్తి-పాచిపెంట

ఒక్క రూపాయి కూడా ఖర్చు కాకుండా సహజ సిద్ధమైన ఎరువుల తయారీకి కంపోస్టు పిట్ ఎంతగానో ఉపయోగ పడుతుందని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని కర్రివలస గ్రామంలో ఐసిఆర్‌పి సుమలత ఆధ్వర్యంలో రైతు లండ నారాయణరావు సహజ నాడెప్ కంపోస్టు పిట్‌ను తయారు చేశారు. గ్రామంలో దొరికే తూటికాడలను అల్లి సహజ నాడెప్ కంపోస్ట్ పిట్ తయారు చేసుకోవాలని ఆయన తెలిపారు. దీని ద్వారా సారవంతమైన ఎరువు తయారవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్య సిబ్బంది విజయ్, సురేష్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత పొందాలని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. మండలంలోని రేగిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో చదువుకు ఉన్న ప్రాధాన్యత గుర్తించి, ఉన్నత చదువులకు వెళ్లే విధంగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, నిబద్ధతతో చదువుకున్న నాడే అనుకున్న లక్ష్యాలను సాధించగలరని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ కృష్ణమూర్తి నాయుడు, ఎటిడబ్ల్యుఒ సురేష్ కుమార్, ఎంఇఒ చంద్రశేఖర్, హెచ్‌ఎం తోట రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం చినమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల కోరిక మేరకు ఎంపిపి బొంగు సురేష్ బోరు నిర్మాణానికి చర్యలు చేపట్టారు.

నడిమికెల్లలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని నడిమికెల్ల గ్రామంలో శనివారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, జ్వర పీడితులు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

చలో పిఠాపురం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సాలూరు

ఈ నెల 14న పిఠాపురంలో జనసేన ఆవిర్భావ సభ సందర్భంగా శనివారం స్థానిక జనసేన నాయకులు చలో పిఠాపురం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. పట్టణ అధ్యక్షులు శివకృష్ణ ఆధ్వర్యాన నాయకులు, కార్యకర్తలు వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14న పిఠాపురంలో నిర్వహించనున్న బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. హాజరైన కార్యకర్తలు క్రమశిక్షణతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మీసాల నవీన్ కుమార్, చంటి, సతీష్ పాల్గొన్నారు.

తోటల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కె.ఇచ్ఛాపురంలో జీడి, మామిడి తోటల పెంపకంపై శనివారం ఉద్యాన శాఖాధికారి టి.అమరేశ్వరి గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. మొక్కలు నాటడంలో మెలకువలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.గౌరినాయుడు, ఎం.సింహాచలం, రైతులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యత

మహిళా దినోత్సవ వేడుకల్లో ఎస్‌పి మాధవరెడ్డి



ఎల్విన్‌పేట కానిస్టేబుల్ మాలతికి ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మహిళా సాధికారతకు జిల్లా పోలీసు శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎస్‌పి ఎస్.వి.మాధవరెడ్డి తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో మహిళా పోలీసులు, విద్యార్థినులు, మహిళా పోలీసు సిబ్బందితో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను ఎస్‌పి కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత వారోత్సవాలు నిర్వహించి, జిల్లా వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మహిళలను గౌరవించే బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. వారోత్సవాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన మహిళా ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకొండ డిఎస్‌పి రాంబాబు, ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, ఎఆర్ ఆర్‌ఐలు రాంబాబు,నాయుడు, ఎస్‌బి సిఐ రంగనాథం, సిసిఎస్ సిఐ అప్పారావు, సోషల్ మీడియా సిఐ శ్రీనివాస రావు, పార్వతీపురం రూరల్ ఎస్ఐ సంతోషి, మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీవిముక్తి సంఘటన ఆధ్వర్యాన... ఎపిఎన్‌జిఒ భవన్‌లో స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు- మహిళల కర్తవ్యాలు అనే అంశంపై సభ నిర్వహించారు. స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.కృష్ణవేణి, ఎపిటిఎఫ్ నాయకులు ప్రమీల రాణి, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడారు. అనంతరం ఆర్‌టిసి కాంప్లెక్సు వరకు ర్యాలీ చేపట్టారు. మహిళా ఉపాధ్యాయులు లలితమ్మ, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు మరియ, జయసుధ, రైతు కూలీ సంఘం నాయకులు నాయుడు, ఎన్‌వైఎస్ నాయకులు పి.అసిరి, పిడిఎస్‌ఒ నాయకులు కె.సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : సీతంపేట గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా స్థాయిలో సీతంపేట పంచాయతీ ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీగా ఎంపికైంది. అందులో భాగంగా ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీలో పంచాయతీల పాత్ర అనే అంశంపై సర్పంచ్ కళావతి ఆధ్వర్యాన శిక్షణ నిర్వహించారు. అనంతరం మహిళా పాలకవర్గ సభ్యులను, ఎంపిటిసిలను, పంచాయతీ, సచివాలయ సిబ్బందిని, క్లాప్ మిత్రులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.గీతాంజలి, ఎపిఎం కమల పాండ్యన్, పంచాయతీ కార్యదర్శి బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మల్లి ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులకు సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కె.కృష్ణారావు, పి.ధర్మారావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : తోటపల్లి జట్టు ట్రస్ట్ నూతన కార్యాలయ ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాబార్డు డిడిఎం దినేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నది మహిళా రైతులేనని చెప్పారు. ఉత్తమ మహిళలుగా మండల అనసూయ (కొమరాడ), నడిమింటి లత (గరుగుబిల్లి), అల్లు విజయశాంతి (భామిని), రోజారమణి (సీతంపేట)లను గుర్తించి సత్కరించారు. జాతీయ భారత నైపుణ్యాభివృద్ధి సంస్థ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారి నాయుడు, ఎన్ఎస్ఎఫ్ఐ నుండి వీరభద్రారెడ్డి, మురిగేషన్, తుంబలి శివాజీ, తదితరులు పాల్గొన్నారు. గరుగుబిల్లిలో ఎపిఎం అప్పలనాయుడు ఆధ్వర్యాన మహిళా సంఘాల సభ్యులు ర్యాలీ చేపట్టారు. ఇందులో ఎంపిపి ఉరిటి రామారావు, ఎంపిడిఒ జి.పైడితల్లి, సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి, తదితరులు పాల్గొన్నారు. తోటపల్లి దేవస్థానం ప్రాంగణంలో మహిళా దినోత్సవాన్ని నాబార్డు డిడిఎం దినేష్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. దేవాలయ అభివృద్ధికి 40 మంది సభ్యులను చేర్పించి సుమారుగా రూ.15 లక్షల విరాళం సేకరించిన వీరఘట్టం గ్రామానికి చెందిన భోగి అరుణ, లక్ష్మణమూర్తి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో చినమేరంగి సిఐ టి.వి.తిరుపతిరావు, ఆలయ ఇఒ వి.వి.సూర్యనారాయణ, కార్యదర్శి డి.పారి నాయుడు, ఎంపిటిసి సింహాచలం, శ్రీరామచంద్ర మూర్తి, పకీరు నాయుడు, దుర్గారావు శంబంగి సత్యం, గౌరు నాయుడు పాల్గొన్నారు.

పాచిపెంట : ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ, పెద్దగెడ్డ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఆధ్వర్యంలో చాపరాయివలసలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలములో దిక్సూచిగా నిలబడ్డ మహిళలను నారీ శక్తి పురస్కారంతో సన్మానించారు. కార్యక్రమంలో ఎఒ తిరుపతిరావు, పశువైద్యాధికారి వెంకటరమణ, ఎంపిటిసి సభ్యులు దండి ఏడుకొండలు, సిహెచ్ అంజలి, ఆర్ట్స్ సిఇఒ ఎంఆర్ఎన్ భట్లు, మన్య సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు పడాల తమ్మయ్య, ప్రాజెక్టు కోఆర్డినేటర్, పెద్దగెడ్డ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సిఇఒ డి.చందు, సందీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మహిళా దినోత్సవం సందర్భంగా పెదబోగిలి, పెదంకలాం, చెల్లమ్మ నాయుడు వలస, గుచ్చిమి, చినబోగిలి, తదితర గ్రామాల్లో సచివాలయాల వద్ద మహిళలతో గ్రామసభలు నిర్వహించారు. వారికి ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు బి.శ్రీనివాసరావు. వి.భారతమ్మ, జె.తేరేజమ్మ, పంచాయతీ కార్యదర్శులు, మహిళలు పాల్గొన్నారు.

వీరఘట్టం : వీరఘట్టంలో అఖిలభారత ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. మహిళపై వేధింపులు, దాడులు, రాజకీయ కక్షలు వంటివి మానుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు కె.సునీత, సిహెచ్ ఝాన్సీ, జామి జ్యోతి, జి.అప్పయమ్మ, బి.సరోజినీ, మహిళలు పాల్గొన్నారు.



కొమరాడ.. ర్యాలీ చేపడుతున్న సిఐటియు, శ్రామిక మహిళా నాయకులు, మహిళలు

మహిళలు అన్నింటా ముందుండాలి

శ్రామిక మహిళా నాయకులు ఇందిర

ప్రజాశక్తి-కొమరాడ

మహిళలు అన్నింటా ముందు ఉండాలని శ్రామిక మహిళా నాయకులు వి.ఇందిర పిలుపునిచ్చారు. కొమరాడ మండలం కుమ్మరిగుంట పంచాయతీ డంగభద్ర గ్రామంలో శనివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటుచేసిన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రతిరోజూ పెరుగుతున్న విష సంస్కృతి, మద్యం, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా మహిళలంతా పెద్దఎత్తున పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, పనిప్రాంతాల్లో భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మహిళలపై దాడులను అరికట్టేందుకు చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు రామారావు పాల్గొన్నారు.



గరుగుబిల్లిలో ర్యాలీ చేపడుతున్న మహిళా సంఘాల సభ్యులు



పాచిపెంట.. రైతులను సన్మానిస్తున్న ఆర్ట్స్ సంస్థ ప్రతినిధులు



సీతంపేట సర్పంచ్ కళావతిని సన్మానిస్తున్న అధికారులు, తదితరులు

జీవాతో జీవన గమనం



రైతులతో మాట్లాడుతున్న నైపుణ్యాభివృద్ధి ఫౌండేషన్ బృందం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జీవా తోనే రైతు జీవన గమనం ముడిపడి ఉందని భారత జాతీయ నైపుణ్యాభివృద్ధి ఫౌండేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని నాబార్డు సహకారంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో జీవ ప్రాజెక్టులో కార్యక్రమాల అమలు తీరును ఫౌండేషన్ బృందం శనివారం పరిశీలించింది. డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన మురుగేశన్, వీర భద్రారెడ్డి బృందం గొరడ గ్రామంలో తాడంగి అమరావతి, పువ్వల గౌరయ్య, టి.బంగార్రాజు క్షేత్రాలను పరిశీలించింది. ఈ సందర్భంగా రైతులతో వారు సమావేశమయ్యారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు చేస్తున్న కార్యక్రమాలు ప్రజలకు, రైతులకు ఏ విధంగా చేరుతున్నాయి, వాటిని ఉపయోగించి ఏ మేరకు సఫలీకృతం అవుతున్నారు, ఆర్థిక జీవన స్థితిగతులు, ఆచార - సంప్రదాయాలు, మార్కెట్ పరిస్థితులు, ఆదాయ - వ్యయాలు, దిగుబడులపై చర్చించారు. రాబోయే రోజుల్లో కూడా కొన్ని గ్రామాల్లో జీవ కార్యక్రమాలు అంతర, మిశ్రమ, సరిహద్దు పంటలు మొదలుకుని అన్ని రకాల పంటలు వేసుకొని కుటుంబ ఆహార భద్రత సాధించాలని వెంకటేశ్వర్లు అన్నారు. కార్యక్రమంలో జీవా ప్రాజెక్టు మానిటరింగ్ అధ్యక్షులు పి.జమ్మయ్య, కార్యదర్శి కె చిరంజీవి, ఆదితల్లి ఎఫ్‌పిసి సిఇఒ పేకాపు మురళి , జీవ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.ప్రబోద్, జట్టు సిబ్బంది, రైతులు మన్మధరావు రామారావు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం

కమిషనర్ ఆన్ డ్యూటీ

కొద్దిరోజులుగా అస్తవ్యస్తంగా ఉన్న పాలకొండ నగర పంచాయతీకి పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ మేనేజర్ టి.జయరాంను కమిషనర్‌గా శుక్రవారం నియమించిన విషయం తెలిసిందే. శనివారం ఉదయం ఆయన తన మార్కు చూపించారు. తెల్లవారు జామున కార్యాలయానికి వెళ్లి చైర్మన్ పల్లా ప్రతాప్‌తో కలిసి పారిశుధ్య కార్మికుల హాజరు పరిశీలించారు. నగర పంచాయతీలో ఐదో వార్డులో కాలువను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. ఈ పర్యటనలో కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, బాబ్జి నాయుడు ఉన్నారు

- ప్రజాశక్తి, పాలకొండ

రక్తదాతలు ప్రాణదాతలే

డిఎస్‌పి రాంబాబు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిఎస్‌పి రాంబాబు

ప్రజాశక్తి-పాలకొండ

రక్తదానం చేసిన వారు ప్రాణదాతలతో సమానమని డిఎస్‌పి ఎం.రాంబాబు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేసి పదిమందిని ఆదుకోవాలని అన్నారు. అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదని చెప్పారు. పోలీసులు కూడా సేవ చేయడంలో ముందంజలో ఉండాలన్నారు. ఈ శిబిరంలో ఎస్ఐతోపాటు మరో 39 మంది రక్తదానం చేశారు. ఏరియా ఆసుపత్రి ఆర్‌ఎంఒ చిరంజీవి ఈ శిబిరాన్ని పర్యవేక్షించారు.

జీడితోట దగ్ధం

ప్రజాశక్తి కొమరాడ

గిరిజన రైతులకు చెందిన జీడి తోట అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని కొత్తవలస సమీపంలో చోటుచేసుకుంది. కొత్తవలసకు చెందిన పువ్వల సురేశ్, లక్ష్మణ తదితరులకు చెందిన ఐదు ఎకరాల వరకు జీడి మామిడి తోట పూర్తిగా కాలిపోయింది. ఈ ఏడాది జీడి పూత బాగా రావడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని రైతులు భావించారు. ఇలాంటి తరుణంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని బాధిత రైతులు వాపోయారు. ప్రభుత్వ స్పందించి జీడి పంటకు నష్టపరిహారం చెల్లించాలని వారు కోరారు.

జీడి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలి

అగ్నిప్రమాదంలో జీడితోటలు కాలిపోయి, నష్టపోయిన గిరిజన రైతులకు పరిహారం చెల్లించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కాలిపోయిన జీడి తోటను పరిశీలించారు. కష్టపడి సాగుచేస్తున్న జీడి తోట చేతికొచ్చిన తరుణంలో ఇలా పంట కాలిపోవడం గిరిజనులకు తీవ్ర నష్టమని ఆయన తెలిపారు. ఐటిడిఎ, ఉద్యాన శాఖ అధికారులు స్పందించి, కాలిపోయిన జీడి తోటను పరిశీలించి, ఎకరాకు రూ.50 వేలు చొప్పున పరిహారం అందించాలని కోరారు. ఈ విషయంపై తహశీల్దార్‌కు వినతి అందిస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు లక్ష్మణరావు, చింతల్లి నారాయణమ్మ, కళావతి, లలిత, వరహాలమ్మ పాల్గొన్నారు.



కాలిపోయిన జీడితోట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మహిళా దినోత్సవం పక్కదారి

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పాలకులు దారి మళ్లించారా? మహిళల మెప్పుకోసం, నిరుద్యోగ యువతుల అసహనాన్ని చల్లార్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్ ప్లే చేస్తారా? అంటే ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఔననే సమాధానం వినిపిస్తోంది. ఇందుకు కారణం లేకపోలేదు. మహిళా దినోత్సవం అంటే ఒకప్పుడు కమ్యూనిస్టులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు మాత్రమే నిర్వహించేవి. క్రమంగా మన జిల్లాలోని పాలకులు సైతం నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజాగా ప్రభుత్వం ఆధ్వర్యాన మునుపెన్నడూ లేనంతగా మార్చి 8న పురష్కరించుకుని శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఇందులో తప్పేమీ లేదు. నిజంగా చెప్పాలంటే ఇదో గొప్ప విషయమే. కానీ, నిర్వహణ తీరులోనే లోపం, రాజకీయ దురుద్దేశం ఉందని జనం అంటున్నారు. మహిళల పోరాట స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా ఉండడమే ఇందుకు కారణం. మహిళా దినోత్సవం అంటే పండగ కాదు. పురుషులతో సమానంగా వేతనం కల్పించాలని, పనిగంటలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ 1908లో అమెరికాలోని న్యూయార్క్ నగరంలో 15వేల మంది మహిళలు భారీ ప్రదర్శన నిర్వహించారు. దీనికి స్ఫూర్తిగా అక్కడి సోషలిస్టు పార్టీ 1909లో అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించి వివిధ కార్యక్రమాలు నిర్వహించింది. క్రమంగా ప్రపంచ దేశాలకు ఈ కార్యక్రమం విస్తరించింది. ఏటా మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రపంచ దేశాలన్నీ నిర్వహిస్తున్నాయి. తొలుత శ్రామిక మహిళలు ఈ కార్యక్రమానికి నాంది పలికితే, ఆ తర్వాత మహిళా కమ్యూనిస్టులు నాయకత్వం వహించి మరింత ముందుకెళ్లారు. ప్రస్తుతం అన్ని పార్టీలు, ప్రభుత్వాలు నిర్వహించాల్సిన పరిస్థితి, ఆవశ్యకత ఏర్పడింది. అందులో భాగంగానే నేడు ప్రభుత్వం మహిళా దినోత్సవం నిర్వహించినట్టు బయటకు కనిపించినప్పటికీ లక్ష్యం వేరుగా కనిపిస్తోందని పలువురు విశ్లేషిస్తున్నారు. వాస్తవానికి మహిళలు ఇప్పటికీ ఇంటా బయటా అనేక సమస్యలు, వేధింపులు, వివక్ష ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల పురుషుల కన్నా ఎక్కువ పనిచేస్తున్నప్పటికీ వారితో సమానంగా వేతనం ఇవ్వడం లేదు. పని ప్రదేశాల్లో మహిళలు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారు. ప్రేమపేరిట వంచించినవారు, ప్రతిఘటిస్తే అత్యాచారాలు, హత్యలు నిరంతరాయంగా మారాయి. చివరకు ప్రభుత్వ శాఖల్లోనూ మహిళలపై వేధింపులు, కక్ష సాధింపులు షరా మామూలుగా ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో నిందితులను శిక్షించేందుకు ఎన్ని చట్టాలు ఉన్నా వాటిని పాలకులే అమలు చేయడం లేదు. గృహ హింస వంటి కేసులు కూడా నీరుగారిపోతున్నాయి. సాక్షాత్తు పోలీస్ శాఖలోనే మహిళల వేధింపులు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. మహిళలకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామన్న హామీ ఇప్పటికీ నెరవేరలేదు.



ఇటువంటి పరిస్థితుల్లో మహిళా సంఘాలు, లేదా పురుషాధిక్యతను విభేదించేవారు మహిళల హక్కుల కోసం, ప్రభుత్వ హామీల అమలు కోసం అవకాశం ఉన్నంతవరకు, పోరాడుతున్నారు. మహిళ సంక్షేమం, అభివృద్ధి, వేధింపులు, దాడుల నివారణకు ఏం చేయాలి? ప్రస్తుత పరిస్థితుల్లో ఏమేరకు చేయగలం అన్న విషయాలు ప్రభుత్వాలు ఆలోచించి ఇలాంటి మహిళా దినోత్సవం రోజున ప్రకటించ వచ్చు. కానీ, అటువంటి పనులు, కార్యక్రమాలు నిర్వహించలేదు. సభలు, సమావేశాలు పెట్టి మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు ప్రభుత్వాలు ఇందుకు సహకరించడమే కారణం అన్నట్టుగా చెప్పుకొచ్చారు. కానీ, మహిళలు, వారి తరపున మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్న సమస్యలపై మాత్రం స్పందించలేదు. పోలీసు శాఖ అయితే మరో అడుగు ముందుకు వేసి కళాశాల స్టూడెంట్లతో విజయనగరంలోని ఆర్‌అండ్‌బి జంక్షన్ వద్ద ఆరు బయట ఎండలో డ్యాన్స్ ప్రోగ్రాం నిర్వహిచారు. ట్రాఫిక్‌ను స్తంభింపజేసి, రోడ్డుపైనే డిజెలు పెట్టేశారు. మహిళల అభ్యున్నతి సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధి ఉంటే ఆయా కాలేజీలు, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యాన నీడలో ఏర్పాటు చేసి, మహిళలు ఎదుర్కొటున్న సమస్యలు, ముఖ్యంగా ప్రేమపేరిట జరుగుతున్న మోసాలు, అత్యాచారాల ప్రతిఘటన, మహిళ రక్షణ కోసం ఇప్పటికే ఉన్న చట్టాలపై అవగాహన వంటి అంశాలపై వివరిస్తే వారిలో కొంత ఆత్మ స్థైర్యం వస్తుంది. చట్టాలపట్ల అవగాహన పెరుగుతుంది. ఇవేవీ చేయకుండా కేవలం ఆటపాటలతో ఉత్సవంలా గడిపేయడం పాలకపక్షాలపై మహిళల ఒత్తిడి తగ్గుతుంది తప్ప, వారికి ఒరిగేదేమీ ఉండబోదని పబ్లిక్ టాక్.

మామ మందలించాడని..!



మృతిచెందిన స్వామినాయుడు

ప్రజాశక్తి-మక్కువ

మామ మందలించాడని అల్లుడు పురుగుల మందు తాగి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మక్కువ ఎఎస్ఐ ఎం.శ్రీనివాసరావు కథనం ప్రకారం.. మండలంలోని రాయచూరు గ్రామానికి చెందిన సామంతల స్వామి నాయుడు(29) ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ, ఇటీవల మానేశాడు. ఇంటి దగ్గర ఖాళీగా ఉండటంతో ఆయన మామ మందలించాడు. ఈ నేపథ్యంలో ఈ నెల ఆరో తేదీన ఉదయం స్వామినాయుడు గడ్డి మందు తాగాడు. వెంటనే బంధువులు ఆస్పత్రికి తరలించారు. విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం పరిస్థితి విషమించి ఆయన మృతిచెందాడు. స్వామినాయుడు భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎఎస్ఐ తెలిపారు.

సర్వే పరిశీలన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని రామవరంలో చేపడుతున్న పి-4 సర్వేను శనివారం ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు పరిశీలించారు. ఫార్మ్ పాండ్స్‌ను పనులను పరిశీలించారు. ఈ నెలఖరికి పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రామవరం సర్పంచ్ పెంట సత్యనారాయణ, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.